క్లుప్తంగా

స్ట్రాంగ్‌కు రూంకు ఈవీఎంల తరలింపు



ఈవీఎంలను తరలిస్తున్న ఆర్వో తదితరులు

కొడంగల్: అసెంబ్లీ ఎన్నికల్లో తుదిఘట్టమైన కౌంటింగ్‌కు మరో 24 గంటల సమయం ఉండటంతో నియోజకవర్గంలోని ఈవీఎంలను శుక్రవారం తెల్లవారు జామున పరిగిలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు. ఆర్‌ఓ లింగ్యానాయక్, తహసీల్దార్ విజయకుమార్, పోలీసు అధికారులు, పలు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఓటింగ్ యంత్రాలను ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా.. పోలింగ్ ముగిసే సమయానికి అధికారిక లెక్కల ప్రకారం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 81.96 శాతం ఓట్లు పోలైనట్లు ఆర్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాములు, ఎస్‌ఐ భరత్‌రెడ్డి, న్యాయవాది సుధాకర్‌రెడ్డి, ముస్తాక్, డాక్టర్ నవాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో 83 శాతం

అనంతగిరి: వికారాబాద్ మండలంలో 83 శాతం పోలింగ్ నమోదు అయిందని ఎన్నికల అధికారులు తెలిపారు. మండల పరిధిలో 23,383 మంది (11,600 పురుషులు, 11783 మహిళా) ఓటర్లు ఉండగా.. (9,848మంది పురుషులు, 9,661 మహిళలు) 19,509 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. వీరిలో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా.. 9గంటల లోపు 3,242మంది ఓటు వేయగా.. 9 నుంచి 11గంటల లోపు 4,353 మంది, 11 నుంచి 1 గంటలోపు 4,372మంది, 1 నుంచి 3గంటల లోపు 3,861మంది, 3-5గంటల లోపు 2,390, మిగితా వారంతా 5గంటల లోపు క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా హక్కు పొందిన నవతరం మొత్తం ఓటు వేసినట్లు తెలుస్తోంది. కాగా ఈ సారి ఓటింగ్ శాతం మండలంలో పెరగడంతో ఇది ఎవరికి అనుకూలంగా మారుతుందనే చర్చ ప్రధాన పార్టీలో జరుగుతోంది.

ఆలయ భూములను కాపాడాలని వినతి

కొందుర్గు: కొందుర్గు శ్రీలక్ష్మీనరసింహ్మస్వామి దేవాలయ భూములను కాపాడాలని ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు నరేందర్ శుక్రవారం దేవాదాయ దర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీనరసింహ్మస్వామి పేరున 300 ఎకరాలకు పైనే ఉన్న భూమిని ఇతరులు ఆక్రమించుకుంటున్నారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన భూములపై కోర్టుల్లో కేసులు నమోదు కావడంతో పాటు దేవాలయానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించారు. తీర్పు ప్రకారం దేవాలయ భూములను మూడు నెలల్లో ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకొని దేవాలయ భూములను కాపాడాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మైసమ్మకు పూజలు



మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ జాతర ఉత్సవాలు భక్త జన సందోహం మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం మైసమ్మకు ప్రత్యేక పూజలు, అర్చనలు మహాలింగార్చన, పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మైసమ్మ దేవతను దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, శిరోలీ తదితరులు ఉన్నారు.

నెలరోజులకే కుంగింది..



పాతరోడ్డులో కుంగిన మ్యాన్‌హోల్

హయత్‌నగర్: హయత్‌నగర్ పాత రోడ్డులో డ్రైనేజీ ట్రంక్‌లైన్ మ్యాన్‌హోల్‌కు రిపేరు చేసిన నెల రోజులకే మరోసారి కుంగింది. దీంతో ప్రయాణికులకు మరోసారి ఇక్కట్లు తప్పడం లేదు. హయత్‌నగర్ నుంచి తొర్రూరు వైపు వెళ్లే పాతరోడ్డు గత సెప్టెంబర్‌లో కంగిపోయి నడిరోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీనికి మరమ్మతు చేసేందుకు సుమారు రెండు నెలలు పట్టింది. గొయ్యితో పాటుగా పక్కనే బలహీనంగా ఉన్న మ్యాన్‌హోళ్లను గుర్తించిన అధికారులు వాటికి కూడా మరమ్మతు చేశారు. కానీ నెలరోజుల్లోనే మరోసారి మ్యాన్ హోల్ కుంగి పోయింది. అప్పుడే రిపేర్ చేసిన మ్యాన్‌హోల్.. అంతలోనే కుంగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం పనుల కారణంగానే మ్యాన్‌హోల్ ధ్వంసమైందని, వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

విజయం మనదే..



పరిగి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇక మిగిలింది ఓట్ల లెక్కే. దానికి మరోరోజు గడువు ఉన్నప్పటికీ.. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నారు. పోటీ దారులతో పాటు, మండల స్థాయి నాయకులు సైతం ఏ ఊరిలో ఎంత మెజార్టీ వస్తుందని ఆరా తీస్తూ.. మా పార్టీదే విజయం అంటే మా పార్టీదే అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఉత్కంఠగా మారిన పోరు

పరిగి అసెంబ్లీ బరిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి అభ్యర్థులు ఉన్నప్పటికీ.. గులాబీ, హస్తం మధ్యే గట్టి పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు నియోజకర్గ పరిధి గ్రామాల ఓటింగ్ సరళిని పరిశీలించి, పోలింగ్ శాతం ఎంత? ఏ మేర ఏఏ పార్టీలకు నమోదు అయిందనే అంశంపై అంచనాలు వేస్తున్నారు. ఏ మండలం, ఏ పార్టీకి అనుకూలంగా ఉందని చర్చించుకుంటున్నారు. గత కంటే ఈ సారి ఎన్నికలు ఉత్కంఠంగా మారాయని చెప్పుకుంటున్నారు. పరిగిలో పైచేయి ఎవరిదనే విషయం పక్కన పెడితే.. పోటీదారులతో పాటు, నేతలు సైతం తమదే గెలుపంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

పోలింగ్ సరళిపై ఆరా

పరిగి నియోజకవర్గంలో పరిగి, పూడూర్, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్, మహ్మదాబాద్ మండలాలు ఉండగా.. వీటి పరిధిలో 2,59,422 మంది ఓటర్లు ఉన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో 1,98,986 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. 76.70శాతం పోలింగ్ నమోదయింది. వాటిపై బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంచనాలు వేస్తున్నాయి. ఇప్పటికే హస్తం, కారు పార్టీలు పోస్టుమార్టం చేసి, ఏ పార్టీలకు ఏఏ మండలాల్లో ఎంత మెజార్టీ వస్తుందని అంచనాలు వేశారు. ఇదిలా ఉండగా.. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా ఉందని, అదే జోరు పరిగిలో ఉండనుందనే చర్చ జరుగుతుండగా.. ఎవరు ఎన్ని లెక్కలు వేసినా.. మరో 24 గంటలు వేచి చూడాల్సిందేనంటూ మేధావుల అభిప్రాయం.

సంబురాల్లో హస్తం శ్రేణులు

పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి గెలుస్తున్నారని కొన్ని సర్వే సంస్థలు చెప్పడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. టీఆర్‌ఆర్ ఇంటికి మండల స్థాయి నేతలు చేరుకొని శుభాకాంక్షలు చెబుతున్నారు. విజయం మనల్నే వరిస్తుందంటూ ధీమా వ్యక్తంచేస్తున్నారు.

గెలుపుపై ఎవరి అంచనాలు వారివే

- మండలాల వారీగా పోస్టుమార్టం
- అధికారం తమదేనంటూ ద్వితీయ శ్రేణుల చర్చ
- ఆదివారం తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

కుల్కచర్ల: ఎయిడ్స్ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి మాధురి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎయిడ్స్ వ్యాధి నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హెచ్‌ఐవీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమ సంబంధాలు పెట్టుకోరాదని, హెచ్‌ఐవీ ఉన్న వ్యక్తులకు వాడిన సిరంజీలను మరొకరికి వినియోగించడం, వ్యాధి సోకిన రోగి రక్తాన్ని మరొకరికి ఇవ్వడం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అవగాహనతోనే మహమ్మారిని కట్టడి చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్, వైద్యులు ప్రశాంతి, శివాని, వైద్య సిబ్బంది రత్నలత, సుజాత, వెంకటమ్మ, జ్యోతి, జంగమ్మ, మైసమ్మ, ఆశ కార్యకర్తలు పాల యాదమ్మ, పెరుగు యాదమ్మ, పుష్పలత, ఊర్మిల, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

లెక్కలే లెక్కలు..



కార్యకర్తలను కలిసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఓటింగ్ సరళిపై చర్చిస్తున్న భీంభరత్ తదితరులు

- ఓటింగ్ సరళిపై సుదీర్ఘ చర్చలు
- ఎక్కడ చూసినా పోలింగ్ తీరుపైనే ముచ్చట్లు
- రేపు తేలనున్న అభ్యర్థుల జాతకం

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఓటింగ్ సరళిపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడనుండటంతో ఏ గ్రామంలో తమ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయనే అంచనాలు వేస్తున్నారు. తక్కువ, ఎక్కువలు కారణాలేమిటి, తదితర అంశాలపై లెక్కలు వేస్తూ అన్ని పార్టీల నాయకులు బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పర్యటించి పార్టీ నాయకులను కార్యకర్తలను కలిసి ఓటింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్నికల్లో మనకు అనుకూలంగా ఉన్న గ్రామాల్లో ఓట్లతో మనం మూడవసారి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ చర్చలు

కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శుక్రవారం పర్యటించి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఓటింగ్ సరళిపై చర్చించారు. మండలాలు, గ్రామాల్లో ఓటింగ్ సరళి ఎలా ఉంది.. అక్కడ మన పార్టీ బలం బలహీనతలు ఎలా ఉన్నాయని చర్చించారు.

ఓటరు నాడి తెలియక తికమక

గ్రామాల్లో ఇరుపార్టీలకు ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తుండటంతో నాయకులు తమకు ప్రజల మద్దతు ఉందని తమదే విజయమని అనుకుంటున్నారు. నిజంగా ప్రజలు ఎవరికి పట్టం కడతారో తెలియక మదన పడుతున్నారు. ఓటరు నాడి తెలుసుకునేందుకు ప్రయత్నించినా.. ప్రజల వద్దకు ఎవరు వెళ్లినా.. వారికే అనుకూలంగా సమాధానం ఇస్తున్నారు. ఇటు సర్వేలు సైతం ఎటు తేల్చలేకపోతున్నాయి. ఈ సారి రాజకీయం పూర్తిగా గతంలో కంటే భిన్నంగా ఉందని అంటున్నారు. ఓటర్లు సైతం నాయకులు చెప్పే మాటలు నమ్మే పరిస్థితి కనిపించటం లేదంటున్నారు. దీంతో ప్రధాన పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సందిగ్ధం తొలగాలంటే రేపటి వరకు ఆగాల్సిందే..

లార్డ్స్ కళాశాలలో కౌంటింగ్

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి.. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తమ్మై ఉంది. షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ గండిపేటలోని లార్డ్స్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈవీఎం యంత్రాలను అధికారులు ఆ కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు గురువారం రాత్రే తరలించారు. ప్రత్యేక బస్సుల్లో భద్రత మధ్య యంత్రాలను తరలించారు. అయితే, కౌంటింగ్ కోసం ఎన్నికల సంఘం వారు నియమించిన వారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతించనున్నారు.

మకాం మార్చిన నేతలు!

- వెలవెలబోతున్న అభ్యర్థుల ఆవాసాలు
- ఓట్ల పండుగ అనంతరం పట్నం బాట



బోసిపోతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసం

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కళకళలాడిన నేతల నివాసాలు ప్రస్తుతం బోసిపోయాయి. ఎన్నికల నగారా మోగిన అనంతరం నగరం, తదితర ప్రాంతాల్లో ఉండే.. రెండు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, వారి అనుచరులు తాండూరు పట్టణంలోని వారి సొంతింటికి వచ్చారు. ఎప్పటిలాగే ఓట్ల పండుగ ముగియగానే నగరానికి వెళ్లిపోతారు. ఈ సారి కూడా అదే జరిగింది. ఎమ్మెల్యేగా బరిలో ఉన్న పోటీదారులు, వారి వర్గీయులు సైతం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఎన్నికల ప్రచార సమయంలో వీ మధ్యనే, మీ బిడ్డగా ఉంటా.. ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తా.. ఆశీర్వదించండి అని అభ్యర్థించిన వారంతా.. ఓటు వేయించుకొని ముల్లెమూట సర్దుకుని ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. దీంతో పండగకు వచ్చిన బంధువుల్లా వీరు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారనే టాఫిక్‌గా ప్రస్తుం నడుస్తోంది.

ఇద్దరూ వ్యాపారులే

తాండూరు అసెంబ్లీ బరిలో నిలిచిన ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పైలెట్ రోహిత్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డిలు స్వతహాగా గ్రామీణ నేపథ్యం కలిగిన వారైనప్పటికీ.. వ్యాపారం నేపథ్యంలో రాజధానిలో ఉంటున్నారు. ఎన్నికల ప్రచారంలో తాను లోకల్, ఇక్కడే ఉంటానన్న ప్రచారంతో రోహిత్ ఓటర్లను ఆకట్టుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి.. తాను తాండూరు వాసినే అని, 30 ఏళ్ల క్రితం నుంచే ఇక్కడ ఇల్లు కట్టుకొని ఉంటున్నాను అంటూ ప్రజలకు దగ్గరయ్యారు. ఇద్దరు అభ్యర్థులకు తాండూరులో సొంత భవనాలు ఉన్నప్పటికీ కుటుంబ సమేతంగా నగరంలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఇద్దరు నేతలు పట్నానికి వెళ్లిపోయారు. ఇక బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు సైతం అదే బాట పట్టగా.. నిన్నమొన్నటి వరకు సందడిగా కనిపించిన వారి నివాసాలు, ఇప్పుడు వెలవెల బోతున్నాయి.

కనీస వసతులు లేక అవస్థలు

- రోడ్లపై పారుతున్న మురుగు
- కంకర తేలిన రోడ్లు
- పట్టించుకోని అధికారులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధి వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య, ధ్వంసమైన రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అటు విజయవాడ జాతీయ రహదారిపై, ఇటు నాగార్జునసాగర్ రహదారిపై డ్రైనేజీ పొంగిపొర్లుతూ దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునేవారు లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై సుష్మా థియేటర్ చౌరస్తా వద్ద, డీమార్ట్ ఎదుట రోడ్డుపై నిత్యం మురుగు పారుతోంది. నాగర్జున సాగర్ రహదారిపై అదే దుస్థితి. సాగర్‌రోడ్డు పక్కన ఉన్న పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. బస్టాప్ ముందు రోడ్డుపై కంకర తేలి అధ్వానంగా మారి, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని మహిళలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజి, రోడ్డు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



టీచర్స్‌కాలనీలో మరమ్మతుకు నోచుకోని మ్యాన్‌హోల్

షాద్‌నగర్ బాద్‌షా ఎవరో?

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం

- గత ఎన్నికల కంటే తగ్గిన పోలింగ్ శాతం
- పోలింగ్ సరళిపై అభ్యర్థుల మల్లగుల్లాలు
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న నేతలు



షాద్‌నగర్ పట్టణ ముఖ చిత్రం



బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్



కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్



బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య



ఏఐఎఫ్‌బీ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల సంగ్రామం ముగిసింది.. రాజకీయ నేతల భవితవ్యం ఈవీఎంల్లో దాగి ఉంది. పోలింగ్ తీరుపై నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. గెలుపుపై అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా ఎవరు గెలుస్తారన్న విషయంపై జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఆదివారం బరిలో ఉన్న అభ్యర్థుల జాతకాలు బయటపడనున్నాయి.

హోరాహోరీ

షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో 14మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే, ప్రధానంగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అంజయ్యయాదవ్, కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్, బీజేపీ నుంచి అందెబాబయ్య, ఆల్‌ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పోటీ పడుతుండగా బీఎస్పీ నుంచి ప్రశాంత్‌కుమార్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి వినయ్‌కుమార్, ధర్మసమాజ్ పార్టీ నుంచి మంచాల భిక్షపతి, స్వతంత్ర అభ్యర్థులుగా తుప్పుడు నర్సయ్య, మంచాల చంద్రమౌళి, నర్సింహ్మా రుస్తుం, అందారి అంజయ్య, రాఘవేందర్, ఆల్ ఇండియా సమతా పార్టీ నుంచి రహమద్దీన్, జై స్వరాజ్ పార్టీ నుంచి మహ్మద్ ఖాజా ముఫిజుద్దీన్‌లు బరిలో ఉన్నారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే ధ్యేయంగా నువ్వా నేనా అన్న రీతిలో హోరాహోరీగా ప్రచారాలను నిర్వహించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. అభ్యర్థులు క్షణం తీరిక లేకుండా ప్రచార జోరును కొనసాగించారు.

పోలింగ్ సరళిపై అంచనాలు

షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 81.96 పోలింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఎంతో ఆసక్తి కనబరిచారు. నియోజకవర్గంలో మొత్తం 2,36,338 ఓటర్లు ఉన్నారు. 1,93,714 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 97,594, మహిళలు 95,089, ఇతరులు 1, ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 81.96 శాతం పోలింగ్ జరిగింది. 2018 ఎన్నికల కంటే ఈ సారి ఐదు శాతం పోలింగ్ తక్కువైంది. పోలింగ్ బూతుల వారీగా పోలైన ఓట్ల ఆధారంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడికలు తీసివేతలు వేసుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విజయంపై ఎవరి ధీమా వారిదే..

నియోజకవర్గంలో ఎవరు విజయం సాధిస్తారన్న విషయంపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రచార అస్త్రాలుగా మలుచుకున్నాడు. కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. బీజేపీ అందె బాబయ్య కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అయితే, బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి బరిలో నిలిచారు. ఎవరు గెలుస్తారన్న విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. షాద్‌నగర్ బాద్‌షా ఎవరో ఆదివారం నిర్వహించే ఓట్ల లెక్కింపుతో తేలనుంది.

లెక్కలేసుకుంటున్న పార్టీల నేతలు

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. గతం కంటే ఓటింగ్ శాతం కాస్త తగ్గడంతో ప్రధాన పార్టీల నేతలు ఎవరికి వారే లెక్కలేసుకుంటున్నారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో 74.18 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,62,005 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,94,343 ఓట్లు పోలయ్యాయి.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

లెక్కల్లో మునిగిన నేతలు...

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు చేరడంతో ఇక ప్రధాన పార్టీల నేతలంతా లెక్కలో మునిగారు. తమ అభ్యర్థులకు ఏయే గ్రామాల్లో ఎన్ని ఓట్లు వచ్చాయో అనే అంచనాలు వేసుకుంటున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు శుక్రవారం గ్రామాల వారీగా పోలైన ఓట్ల వివరాలను సేకరించి అందులో తమకు ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయని లెక్కలు రాసుకుంటున్నారు. ఏయే గ్రామాల్లో తమకు బలముందో చూసుకుంటూ తమకు లీడ్ వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులంతా ఇలా లెక్కలేసుకుంటూ తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే అభ్యర్థుల భవితవ్యం ఆదివారం తేలనుంది.

యువ ఓటర్లు ఎక్కడ మొగ్గారు?

ఈ సారి ఎన్నికల్లో యువ ఓటర్లు భారీగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చినవారు సైతం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. అయితే ఈ సారి యువతరం ఎక్కడ మొగ్గిందనే అంశాన్ని రాజకీయ పార్టీలు విశ్లేషించుకుంటున్నాయి.



ఓటింగ్‌పై లెక్కలేసుకుంటున్న నాయకులు

ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీల ప్రచారాల్లో యువతే అధికంగా కనిపించింది.ఏది ఏమైనా అభ్యర్థుల భవితవ్యం బయటపడాలంటే రేపటి వరకు ఆగాల్సిందే.

విదేశీ చట్టాలపై అవగాహన

అక్షరలో అంతర్జాతీయ వేడుకలు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

బడంగ్‌పేట్: విద్యార్థులకు విదేశీ చట్టాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు నాదర్‌గుల్ అక్షర స్కూల్‌లో 'అంతర్జాతీయ దినోత్సవం' పేరిట శుక్రవారం వేడుకలు నిర్వహించారు. పాఠశాల సీఈఓ మధన్‌మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియా, ఆస్ట్రేలియా, చైనా, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, యూఏఈ, ఈజిప్ట్ దేశాలకు సంబంధించిన సంస్కృతి, సాంప్రదాయాలు, వేషధారణ, చారిత్రక కట్టడాలు, ఆహార పదార్థాలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఈఓ మధన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో విదేశాల్లో స్థిరపడే విద్యార్థుల కోసం ఈ వేడుకను నిర్వహిస్తున్నామన్నారు. పాసుపోర్ట్ వెరిఫికేషన్, చెకింగ్ ఎంబసీలు, పరాయి దేశాలకు మన దేశానికి ఉన్న కాలమాన వ్యత్యాసాలు, ఆయా దేశాల్లో ఉన్న నియమాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ హర్ష సోలంకి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని

బడంగ్‌పేట్: పల్లవి, ఆవేర్ ఇంటర్నేషనల్ స్కూల్ సరూర్‌నగర్ ఆధ్వర్యంలో 'రసాజ్ఞ ది నవరస–23' పేరుతో వార్షికోత్సవాలు నిర్వహించారు. టాలెంట్–21 సీఈవో గురిందర్‌పాల్‌సింగ్, డీపీఎస్, పల్లవి విద్యాసంస్థల సీఈవో మల్కా యశస్వీ, అకాడమిక్ డైరెక్టర్ సుధ తురగ, స్కూల్ డైరెక్టర్ అనితారెడ్డి, ప్రిన్సిపాల్ చారుజైన్ వేడుకలు ప్రారంభించారు. నాటక, క్రీడలు, కరాటేలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందచేశారు. విద్యార్థుల పాటలు, నాటక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.